# తృప్తి



**అరవై ఏళ్లు దాటిన నాగులు ఐస్‌క్రీమ్ బండిని ఆయాసంతో ముందుకి తోస్తున్నాడు.**

నిప్పులు చెరుగుతున్న సూరీడు జనావళి మీద కనికరం లేనట్లుగా తన ప్రతాపాన్ని చూపిస్తుంటే ఏరులా కారుతున్న చెమటని తలపాగాతో తుడుచుకొన్నాడునాగులు.

ముడతలు పడ్డ శరీరం ఎండకి తట్టుకోలేక బాధగా మూలుగుతుంటే అతని గుండెలో నిప్పు రవ్వ పడ్డ తాటాకుల్లా మండుతున్నాయ్.

తను పూర్వంలా వీధులవెంట తిరగలేక పోతున్నాడు.

కళ్లు సరిగ్గా కనిపించడం లేదు.

అయినా పొట్టకోసం బండిని నడపటం తప్పడం లేదు.

తన ఊరు వదిలి ఈ ఊరు వచ్చేముందు ఎంతలా బాధపడ్డాడు.

తర్వాత తనకు తానే సర్దిచెప్పుకుని గుండె దిటవు చేసుకొన్నాడు. తన అప్పుకి జవాబుగా జీవితాంతం వెట్టి చాకిరి చేసే శక్తి లేక పున్నయ్య కొలువులోంచి పారిపోయి వచ్చాడు. తన బతుకు కథ దీనంగా విన్న జగ్గారావు గారు ఐస్‌క్రీమ్ బండిని అప్పచెప్పారు.

అతని దగ్గర పనిచేసే మిగతా కుర్రాళ్లు ఆశ్చర్యపోతూ అన్నారు.

'ఈ ముసలోడు వీధులు తిరిగి ఐస్‌క్రీములు అమ్మగలడా' అని వాళ్ల మాటలకి జగ్గారావు నవ్వేసి ఊరుకున్నాడు.

ఆ మర్నాటి నుండి తన నిజాయితీ గుర్తించిన రావు గారు పూర్తిగా తనమీద నమ్మకం ఏర్పడింది.

ఎదురుగా పిల్లలగుంపు రావడంతో నాగులు ఆలోచనలు చెదిరిపోయాయి.

ఆశగా ఆత్రంగా వాళ్లవంక చూశాడు.

అందరూ జేబుల్లోంచి డబ్బులుతీస్తున్నారు.

ఈ రోజు బేరం బాగుంటాది అనుకుంటూ అందరికీ ఐస్‌క్రీములు అందించసాగాడు.

వరాలు టీ కొట్లో పనిచేసే శంకరం మాత్రం దూరంగా నిలబడి ఎటో చూస్తున్నాడు.

"ఏరా! నీకు ఐస్‌క్రీమ్ వద్దా!" నవ్వేడు నాగులు.

"లేదు తాతా! నా దగ్గర డబ్బుల్లేవు. ఉదయం టీ గ్లాసు చెయ్యిజారి కింద పడింది. అందుకే వరాలు డబ్బివ్వలేదు."

ఆ మాటలకి దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నాడు.

"ఫర్లేదు.. ఈసారికి తీసుకో.. డబ్బులున్నపుడు ఇద్దువుగాని"

నాగులు వంక కృతజ్ఞతగా చూసి ఐస్‌క్రీమ్ అందుకున్నాడు శంకరం.

అలా కొంతదూరం వెళ్లేసరికి స్కూలు పిల్లలు తన కోసం ఎదురు చూస్తున్నట్లుగా నిలబడ్డారు.

వాళ్లందరి వంక తృప్తిగా చూసి ఐస్‌క్రీమ్‌లు అందించాడు. గల్లాపెట్టె, గణ గణమని శబ్దం చేస్తుంటే హుషారుగా అడుగులువెయ్యసాగాడు.

వేపచెట్టు మలుపు తిరగబోతుంటే అడ్డుగా కారు కనిపించింది. అక్కడున్న పెద్ద ఖాళీ స్థలంలో బిల్డింగ్ కడుతున్నారు.

"కిటికీలు సరిగ్గా అమర్చారా"

నీలి కళ్లద్దాలు పెట్టుకొన్న పెద్ద మనిషి కారు దగ్గర నిలబడి నస్తాదులాంటి మనిషితో అంటున్నాడు.

ఆ మనిషి వెళ్లిపోగానే కళ్లద్దాలు తీసి భారంగా నిట్టూరుస్తున్న పెద్దమనిషిని చూస్తూ యథాలాపంగా అన్నాడు నాగులు.

"బాబూ! ఐస్‌క్రీమ్ తినండి. కాస్త సేద తీరాక బిల్డింగ్ లోకెళ్లి పన్లు చూద్దురుగాని!"

ఆ మాటలకి ఉలిక్కిపడ్డట్టుగా చూసిన పెద్దమనిషి నిస్తేజంగా నవ్వుతూ అన్నాడు.

"ఆ బిల్డింగ్‌నేనే కట్టిస్తున్నా అందులోకి వెళ్లే అదృష్టం నాకులేదు తాతా"

"అదేటి బాబూ ఆశ్చర్యంగా చూశాడు నాగులు.

"ఔను ఆ బిల్డింగ్ పూర్తయిన ఆరు నెలల వరకు అందులోకి వెళకూడదని ఓ జ్యోతిష్కుడు చెప్పేడు బాధగా నిట్టూర్చాడతను.

అతని మాటలకి విరాగిలా నవ్వేడు నాగులు.


విశ్వనాథరమ

"మీ నమ్మకాలు బాగున్నాయి బాబూ. ఈ బతుకులు నీటి బుడగల్లా శాశ్వతమా! ఎప్పుడైనా పోయే వాళ్లమేగా. ఈ నమ్మకాలు చెదపురుగుల్లాంటివి. అవి నమ్మినంతసేపు గుండెని దొలిచేస్తాయి.

మీరు ఏ లోటు లేని శ్రీమంతులు. తృప్తిగా మీ కోరికలు తీర్చుకోండి. లక్షలు పెట్టి కట్టుకున్న ఇంటిని కళ్లారా చూసుకోండి"

నాగులు మాటలకి విభ్రాంతిగా చూశాడు ఆ పెద్దమనిషి.

"కాస్త శాస్త్రం తెలిసిన మనుషులు అలా చెప్పేసరికి భయంగా ఉంటోందోయ్" చేతులు కట్టుకుంటూ అన్నాడతను.

"ఏం శాస్త్రాలు బాబు! ఆ శాస్త్రం తెలిసిన మనిషి బతుకు శాశ్వతమా? ఎన్నో సత్యాలుచెప్పిన బ్రహ్మంగారు బతకలేదు. గాంధీగారు బతకలేదు. ముంచుకొస్తున్న కాలంలో అందరూ మునిగిపోతున్నారు.

ఇది నిజమా కాదా చెప్పండి బాబు!

"ఫర్లేదు తీసుకోండి"

నాగులు అభ్యర్థన త్రోసిపుచ్చలేక ఐస్‌క్రీమ్ అందుకుంటూ చెప్పేడతను.

"నా చిన్నతనంలో ఐస్‌క్రీమ్ తినాలని సరదా పుట్టేది. కానీ డబ్బుల్లేక తిన్న వాళ్లని చూస్తుండే వాడిని. ఇప్పుడు స్తోమతవున్నా దానిమీద కోరికలేదు" అంటూ జేబు తడిమాడు.

కొత్తగా మెరుస్తున్న రెండు రూపాయల నోటు నాగులుకి అందించాడు.

"వొద్దు బాబూ.. నా దగ్గర చిల్లర లేదు"

"ఫర్లేదు. తీసుకో!" అంటూ ఆ నోటు నాగులు చేతిలో కుక్కి బిల్డింగ్ వైపు నడిచేడతను హుషారుగా.

అతని వంక చూసి మనస్ఫూర్తిగా నవ్వుకుంటూ రోడ్డు మీద కొచ్చాడు నాగులు. ఐస్‌క్రీమ్.. ఐస్‌క్రీమ్" అంటూ.. ఇప్పుడతని గొంతులో ఉత్సాహం కృష్ణలా ఉరకలు వేస్తోంది.

* *** *




జ్ఞానోదయం అయిన మనిషిలా హాయిగా ఊపిరి పీల్చుకుని ఏదో నిర్ణయానికి వచ్చినట్లు ఆ బిల్డింగ్ వైపు తిరిగేడతను.

కూలీలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తమ పని తాము నిర్వర్తిస్తున్నామనే పట్టుదల, దీక్ష తప్ప వాళ్ల మొహాల్లో ఏ కోశాన స్వార్థంలేదు. తాముచేస్తున్న పనికి ఈ రోజు కూలి దొరుకుతుందనే తృప్తి లీలగా కనిపిస్తోంది.

ఆ దృశ్యం మనసుని స్పందింప చేస్తుంటే నాగులు వైపు తిరిగి అన్నాడతను.

"నిజమే తాత! మనం నిమిత్త మాత్రులం. జరిగిన వాటిని అంగీకరిస్తూ జరగబోయే వాటికి తలవొంచవలసిందే"

అతని మటలకి నాగులు ఛాతి ఉప్పొంగింది. తన మాటలు అంత పదునుగా వుంటాయి. ఎంతటి వాళ్లయినా నిదానంగా వింటారు. ఆ పెద్దమనిషి వైపు చూస్తూ సంతోషంగా అన్నాడు.

"బాబు! ఐస్‌క్రీమ్ తీసుకోండి"

'ఎప్పుడూ పిల్లలకి ఐస్‌క్రీమ్ కొనిపెట్టడమే గాని నేను తినలేదు' నవ్వేడతను.

తెరలు తెరలుగా వస్తున్న దగ్గుని ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు నాగులు.

వారంరోజులబట్టి బండిని వీధుల్లోకి తీసుకెళ్లడం లేదు.

గుండెల్లో సెగలాంటి బాధ.

తనకెవ్వరూ లేరనే మానసిక వ్యథ మనసుని అనుక్షణం మండించేస్తుంటే లోలోపలే బాధపడుతున్నాడు నాగులు.

చిన్నప్పట్నుంచి గాలివాటుగా పెరిగేడు. బంతిపువ్వులాంటి గౌరిని పెళ్లి చేసుకున్నాక బతుకు స్వర్గమే అనుకున్నాడు. పెనుతుఫాను వరదల్లో గౌరి చచ్చిపోవడం చూసి యంత్రంలా జీవితాన్ని గడుపుతున్నాడు.

అందుకే పువ్వుల్ని చూసినా పిల్లల్ని చూసినా గౌరిలా తనకు ప్రేమ.

గుమ్మం దగ్గర అలికిడైంది.

జగ్గారావు ఇంటి దగ్గర నుండి ఐస్‌క్రీమ్ బండి తెచ్చాడో కుర్రాడు.

"ఈసి ఒంట్లో బాగుంటే బండి తిప్పమన్నారు అయ్యగారు!

బండిని చూడగానే ఏదో శక్తివచ్చింది నాగులుకి.

తన నిజాయితీ మీద ఎనలేని గురి బాబుగారికి. చిన్నగా నవ్వుకుంటూ బండి పట్టుకున్నాడు.

నీరసం ఒంటిని తోడేస్తుంటే బండిని నెమ్మదిగా పోనిస్తున్నాడు.

ఎప్పటిలా పిల్లలు ఐస్‌క్రీమ్ కొంటూ గల్లా పెట్టె నింపుతున్నారు.

ఒక చోట నాగులు కాళ్లు బరువుగా నిలిచిపోయాయి.

ఆకుపచ్చ మేడ దగ్గర జనం గుమిగూడడంతో బండి ఓ పక్కకి పెట్టి ఆ గుంపు లోంచి తొంగి చూశాడు.

అక్కడ కన్పించిన దృశ్యం చూసి కొయ్యబారి పోయాడు నాగులు.

నిలువెత్తు గులాబీ దండలతో పాడెమీద బిల్డింగ్ దగ్గర తనతో మాట్లాడిన పెద్దమనిషి. తన ఐస్‌క్రీమ్ తిన్న వ్యక్తి.

కంపిస్తున్న శరీరంతో కళ్లు నులుముకొంటూ చూశాడు. సందేహంలేదు. అతనే. మనం నిమిత్త మాత్రులం అన్న అతడి రూపాన్ని నెమరువేసుకుని తదేకంగా అటువైపే చూడసాగాడు.

మొహంలో ఏదో తృప్తి అనిర్వచనీయమైన ఆత్మ సంతృప్తి అనుభూతి ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే నాగులు దీర్ఘంగా నిట్టూర్చాడు

ఆ గుంపులోంచి బయటికొచ్చాడు.

ఇంతవరకు అతనిలో దాగిన నిరాశ, నిస్పృహలు మాయమయ్యాయి.

గుండెలో దాగిన వెలితి తృప్తితో పూడుకుపోయింది.

ఆ వీధి మలుపు తిరుగుతూంటే పిల్లలు కనిపించారు.

ఉత్సాహంతో అటువైపు వెళదామనుకున్నాడు. అడుగులు ముందుకి పడనివ్వలేదు.

ఆయాసం శరీరాన్ని కుదిపేస్తోంది. దాహంతో నోరెండి పోతోంది. అతని చేతులు పట్టు తప్పుతున్నాయ్.

దూరంగా కనిపిస్తున్న శంకరం ఆపద్బాంధవుడిలా కనిపించేసరికి లేని శక్తి తెచ్చుకుని గట్టిగా కేక పెట్టాడు.

ఒక్కంగలో బండి దగ్గర కొచ్చి నాగులు పరిస్థితి చూశాడు శంకరం.

చెమటతో తడుస్తూ రొప్పుతున్న నాగులుకి ఐస్‌క్రీమ్ పెట్టెలోంచి ఒక ఐస్‌ముక్క తీసి నోట కందించాడు.

చల్లని ముక్క నోటికందగానే పేద తీరినట్లుగా అనిపించింది. ఇంత తియ్యటి చల్లగడ్డలు ఇన్నాళ్ళు బండిలో వేసుకుని అమ్మాడు.

ఒక్కనాడు కూడా వాటి రుచి చూళ్లేదు. తృప్తితో అతని మనసు మూలిగింది.

ఒక చేత్తో తనను, ఇంకొక చేత్తో బండిని పట్టుకున్న శంకరాన్ని చూసి నాగులు కళ్లు ఏదో అనుభూతితో మూసుకున్నాయ్. అతని చెయ్యి పట్టుతప్పింది. బండి పక్కనే ఒరిగిపోయాడతను.

○